ప్రజాశక్తి
శనివారం 11 మార్చి 2023
5
శ్రీ సత్యసాయి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పీవోలు, ఏపీవోల పాత్ర కీలకం

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలి

కలెక్టర్ పి.బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పిఒలు, ఏపీవోల పాత్ర ఎంతో కీలకమని, వీరందరూ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో శుక్రవారం నిర్వహించిన రెండవ విడత శిక్షణ తరగతుల్లో పీవోలు, ఏపీవోలు, జోనల్ ఆఫీసర్లకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పీవోలు, ఏపీవోలు, జోనల్ ఆఫీసర్లు సయోధ్యతో పని చేయాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌పై బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పేపర్ ఎలా ఉపయోగించాలి, ఫోల్డ్ చేసే విధానం, సీల్ చేసే విధానం తదితర అంశాలపై అవగాహన ఉండాలన్నారు. తాను, ఎస్పి పోలింగ్ పోలింగ్ అయ్యేంతవరకు పోలింగ్ స్టేషన్ల వద్ద అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి సందేహం వచ్చినా తమను సంప్రదించాలన్నారు. సిబ్బంది ఎన్నికల విధులను క్షుణ్ణంగా తెలుసుకుని పనిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ మాట్లాడుతూ మార్చి 12న ఉదయం 7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని పోలింగ్‌కి సంబంధించిన సుమారు 30 దాకా ఉన్న వివిధ వస్తుసామగ్రిని తీసుకుని చెక్ లిస్ట్ ప్రకారం వాటిని సరిచూసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్ ల నిర్వహణ పనితీరు, పిఒ డైరీ, పోలింగ్ అనంతరం ఆయా ఏజెంట్ల సంతకాల సేకరణ, బ్యాలెట్ బాక్స్ సీలింగ్ తదితర అంశాలలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ముందస్తుగా, ప్రణాళికాబద్ధంగా విధులు చేపట్టాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో డిఆర్ఒ కొండయ్య, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ అధికారి డీఆర్డీఏ పీడీ నరసయ్య, బ్యాలెట్స్ పేపర్స్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు చిన్నయ్య, ఖతీజుతిన్ కుబ్రా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్, డిప్యూటీ తహసీల్దార్లు మైనుద్దిన్, నరసింహులు పాల్గొన్నారు.

'కట్ట'లు తెంచుకుంటున్నాయ్...!



- ఓటుకు నోటు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- తాడిపత్రిలో ఆన్‌లైన్‌లో పంపిణీ చేసినట్టు గుర్తింపు
- తక్కిన చోట నేడు, రేపు పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. నేటి సాయంత్రంతో ప్రచారాలూ ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నోట్ల కట్టలు సిద్ధమవుతున్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బుల 'కట్టలు'తెంచుకుంటున్నాయి. సిద్ధమవుతున్నాయి. ప్రధాన పార్టీ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటుకు ఐదువేలు, పట్టభద్రులకు ఓటుకు మూడు వేల చొప్పున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు గుట్టుగా సాగిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు ఆయా పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లను ఇప్పటికే గుర్తించినట్టు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఉంటున్న ముఖ్య నేతల ఇళ్లకు డబ్బులు చేరినట్టు సమాచారం. పోలింగ్ తేదీకి ముందు రోజు పక్కాగా డబ్బులు పంపిణీనికి సిద్ధం చేసారన్న ఆరోపణలున్నాయి.

మండలి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులకు టిఫెన్ బాక్సులివ్వడం పెద్ద దుమారం రేపింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బహుమతులు కాకుండా నేరుగా క్యాష్ రూపంలోనే పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతోపాటు అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులు అధికార బలాన్ని వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతకు మునుపు ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలతో మాట్లాడటమే కాకుండా ఎన్నికల్లో వారు పనిచేసే విధంగా ఒత్తిడి చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రయివేటు స్కూల్ యాజమాన్యాల సంఘానికి సంబంధంచిన ఒక వ్యక్తి కూడా ప్రయివేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను అధికారపార్టీకి అనుకూలంగా ఓటింగ్ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

తాడిపత్రిలో ఆన్‌లైన్‌లో పంపిణీ చేసినట్టు గుర్తింపు

తాడిపత్రిలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు డబ్బులు పంపిణీ చేసినట్టు ఆరోపణలు రావడమే కాకుండా పోలీసులు దీనిపై ఆరా తీయడం చర్చనీయాంశం అవుతోంది. స్వతంత్ర అభ్యర్థిగానున్న చామల అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ఎస్‌బిఐ సర్వీసు కేంద్రం నుంచి కొంత మందికి నగదును ట్రాన్సుఫర్ చేసారన్న ఆరోపణలు రావడంతో తాడిపత్రి పోలీసులు ఆ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయనకు సంబంధించిన సిపియు, మానిటర్‌ను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

పశ్చిమ రాయలసీమ పరిధిలో ఓటర్లు ఇలా...

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 330124మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాలో 61633, నంద్యాలలో 54929 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 68341 మంది ఓటర్లు ఉన్నారు. సత్యసాయి జిల్లా 43310, వైఎస్ఆర్ 81317 మంది ఓటర్లు ఉండగా, అన్నమ్య జిల్లాలో 20594 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు జిల్లాలో 5391 మంది ఓటర్లు, నంద్యాలలో 4426, అనంతపురం జిల్లాలో 5564 మంది ఓటర్లు, సత్యసాయి జిల్లాలో 3348 మంది ఓటర్లు, వైఎస్ఆర్ జిల్లాలో 7461 మంది ఓటర్లు, అన్నమయ్య జిల్లాలో 1958 మంది ఓటర్లు ఉన్నారు.

డబ్బులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు రావడంతో తాడిపత్రిలోని ఓ ఎస్‌బిఐ సర్వీసు కేంద్రంలో విచారణ చేస్తున్న పోలీసులు

ఓటర్లకు నగదు బదిలీకి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ఎస్‌బిఐ సర్వీసు కేంద్రం నుంచి కంప్యూటర్‌లను తీసుకెళ్తున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్పీ డా॥ఫక్కీరప్ప

'హవాలా' దోపిడీ..!

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

హవాలా డబ్బును తరలించే ముఠాలపై మాటువేసి దారి దోపిడీలకు పాల్పడే ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఈ ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.89 కోట్లు నగదు, రెండు కార్లు, ఐదు మొబైల్ ఫోన్లు, 13 నంబరు ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా దేశంలో హవాలా డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడి వెలుతున్నాయో ముందుగా తెలుసుకుని ఆ మార్గంలో కాపుకాచి దారిదోపిడీకి పాల్పడుతూ వచ్చాయి. ఈ డబ్బు హవాలా కావడంతో ఫిర్యాదులు కూడా స్టేషన్లకు రాకపోవడంతో యథేచ్ఛగా వారి దోపిడీలను కొనసాగించారు. ఇటీవల దీనిపై రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఓ ఫిర్యాదు అందడంతో అనంత పోలీసులు దీనిపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ ముఠా కోసం 25 బృందాలను ఏర్పాటు చేసి, పక్క రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని దోపిడీ ముఠాను అరెస్టు చేశారు.

వార్త మెయిన్‌లో..

పోలింగ్‌కేంద్రాల పరిశీలన

ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కనగాన పల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ బసంత్ కుమార్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా తహశీల్దార్ రమణ, ఎస్ఐ హనుమంతరెడ్డితో ఎన్నికల ఏర్పాట్ల గురించి చర్చించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ యశ్వంత్, ఎస్ఐ గోపీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నంబుల పూలకుంట : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాఘవేంద్ర తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రం వద్దమౌలికవసతులు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవినాయక్, ఎస్ఐ సద్గురుడు తదితరులు పాల్గొన్నారు

హోరెత్తిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 13న జరుగుతున్న శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో శనివారం నుంచి ప్రభుత్వ సెలవులు ఉండడంతో శుక్రవారం అన్ని పార్టీల వారు ప్రచారాన్ని హోరెత్తించారు. పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి తరపున సిపిఎం, ఎస్ఎఫ్ఐ, ఎఐటియుసి నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అదే విధంగా వైసిపి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డితో పాటు ప్రముఖ పారిశ్రామిక వేత్త, 35వ వార్డు కౌన్సిలర్ జయరాములు ప్రచారం నిర్వహించారు. అదే విధంగా టిడిపి బలపర్చిన అభ్యర్థుల తరపున అంబికా లక్ష్మినారాయణ, నాగరాజు, రమేష్‌కుమార్ తదితరులు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు.

కనగాన పల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యరి కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా టీడీపీ మండల కన్వనర్ యాతం పోతలయ్య ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, ఎంపిటిసి బిల్లే భాస్కర్, సీనియర్ నాయకులు ముకుందనాయుడు, పూజారి రాజాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

కర్నాటకలో 'పురం' విద్యార్థి ప్రతిభ

హిందూపురం : హిందూపురం పట్టణం సడ్లపల్లికి చెందిన ఎస్. తేజస్ కర్నాటక రాష్ట్రంలో డిగ్రీలోనే కాకుండా పోస్ట్ గ్రాడ్యుయేషన్ లోను విశ్వవిద్యాలయ పరిధిలో ప్రథమ స్థానం సాధించి విజయకేతనం ఎగురవేశాడు. శుక్రవారం విశ్వం విద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నాడు. సడ్లపల్లికి చెందిన తేజస్ బెంగళూరు విశ్వ విద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి, గ్రామీణ అభివృద్ధి విశ్వవిద్యాలయం తరపున ప్రజా ఆరోగ్య విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ప్రథమ ర్యాంకు సాధించారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు తేజస్‌ను

కర్నాటక గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న తేజస్

మోహిని అవతారంలో ఖాద్రీశుడు

ప్రజాశక్తి కదిరి అర్బన్



ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీశుడు మోహిని అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మోహిని అవతారంలో ఊరేగించారు. మోహిని ఉత్సవానికి ఉత్సవ ఉభయదారులుగా కోట వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ ఎత్తున తరలివస్తున్న భక్తులకు అన్నదాన కార్యక్రమము నిత్యంకొనసాగిస్తున్నామని ఆలయ ఈవో గురు ప్రసాద్, పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. కుమ్మరవాండ్లపల్లి గ్రామానికి చెందిన కొండయ్య, భజన కమిటీ సభ్యుల మహిళలు కోలాట భజనలతో ఆకట్టుకున్నారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ పి.బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పది పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 424 పరీక్ష కేంద్రాల్లో 25,881 మంది విద్యార్థులు పరీక్షలు రాయన్నారని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరగనున్నాయన్నారు. ఇందులో ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సీ పరీక్షల కోసం జిల్లాలో ఐదు సెంటర్లలో 30 పరీక్ష కేంద్రాల్లో 824 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను జిల్లాలో 9 సెంటర్లలో 38 పరీక్ష కేంద్రాల్లో 1,605 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఆయా పరీక్షల కోసం పకడ్బంది ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త జిల్లాలో జరుగుతున్న మొదటి పరీక్షలను విజయవంతం చేసేందుకు అధికారులంతా నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్ష హాల్లోకి ఏ విధమైన సెల్ ఫోన్ లు తీసుకురాకుండా చూడాలన్నారు. సిబ్బంది కూడా ఎవరూ కేంద్రంలోకి సెల్ ఫోన్ తీసుకురాకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సమయానికి ఉదయం, మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. పరీక్ష జరిగేరోజుల్లో కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో మీనాక్షి, అడిషినల్ ఎస్పీ కెవిఆర్‌కె.ప్రసాద్, డీవీఈవో రఘునాథరెడ్డి, డిఎంహెచ్ఒ డా॥కష్ణారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, హిందూపురం పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ కళ్యాణ్ రామ్ పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

సమాన హక్కుల కోసం ఉద్యమిద్దాం : ఐద్వా

సోమందేపల్లి : మహిళల హక్కుల కోసం , హింస , దోపిడీ , వివక్షతకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిగా మహిళలు పోరాటం కొనసాగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి కోరారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపంల ఐద్వా, సిఐటియు కమిటీల ఆధ్వర్యంలో కామ్రేడ్ గాయత్రి అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు మహిళల పరిస్థితిని ఏమాత్రం మెరుగుపర్చకపోగా మరింత దిగజార్చుతున్నాయని విమర్శించారు. మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాల అమలుపట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాల వలన మహిళల్లో పేదరికం , నిరుద్యోగం పెరిగి ఆకలి చావులు వస్తున్నాయన్నారు. మరోవైపు స్త్రీల అభిప్రాయాలకు, ఆలోచనలకు ఏమాత్రం విలువ లేకుండా ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనివీటన్నింటినీ వ్యతిరేకిస్తూ ఇప్పటికే మహిళలు పోరాడుతున్నారని అన్నారు. వివక్ష , అంటరానితనం , సమానత్వం , హక్కుల సాధన లాంటి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రివేణి, మండల నాయకులు శోభారాణి, గాయత్రి, మహిళలు ముంతాజ్, అలివేలమ్మ, షబానా, చంద్రకళ, భారతి, శాంతి, గంగాదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు

వృద్ధురాలికి చేయూత

ధర్మవరం టౌన్ : నియోజకవర్గ మైనార్టీ ప్రధానకార్యదర్శి బాబా తల్లి ఆరోగ్యం బాగాలేదని తెలుసుకున్న 10వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్ చేయూత నందించారు. ఈ మేరకు శుక్రవారం బాబా తల్లిని పరామర్శించి వైద్యఖర్చుల కోసం జమీర్ అహమ్మద్ రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న నాయకులు

ఈదుల ముష్టూరులో గ్రామోత్సవం

బత్తలపల్లి : మండలంలోని సంజీవపురంలోని కాటి కోటేశ్వరుని క్షేత్రంలో గురువారం రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం గ్రామంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురవయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బత్తలపల్లి ఎస్ఐ టీవీ శ్రీహర్ష తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

బత్తలపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు, యువజన నాయకులు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సల్లబోయనపల్లిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచు గొల్లపల్లి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 'గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిపై బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయపరెడ్డి సవాలయాల కన్వీనర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది నిరసన

కదిరి అర్బన్ : రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలోనిర్వహించ తలపెట్టిన నల్ల బ్యాడ్జుల నిరసన కార్యక్రమం రెండవ రోజుశుక్రవారం కొనసాగింది. తొలిసర్వీసుకు హాజరయ్యే సిబ్బందితో కలసి ఈ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శంకరప్ప, డిపో అధ్యక్షుడు కాలసముద్రం దివాకర్, నాయకులు హరికుమార్, జిసిఎస్ నాయుడు, సలాం భాషా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తలుపుల : తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ లో భాగంగా శుక్రవారం వైద్యాధికారిని రోజా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసవ సమయం వరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈసదర్భంగా పెద్దన్నవారిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గంగిశెటి గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మూడు నెలలుగా క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం ఆరోగ్య పరిక్షల కోసం వచ్చే గర్భిణులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. సత్యసాయి సేవా సమితి వారి సేవా గుణాన్ని డాక్టర్ తేజా కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరీష్ బాబు, నరసింహరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

కదిరి అర్బన్ : జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలోకి శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా భైరవ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుహాయల్ ఖాన్, ముజీబ్, మురళి, శ్రీనివాసులు నాయక్, నగేష్, హర్షవర్ధన్‌తో పాటు 20 మంది యువకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చలపతి, కుటాల లక్ష్మణ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

హిందూపురం : మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు దశల వారీగా ఉద్యమాలను చేపడతామని ఎపి జెఎసి నాయకులు సుధాకర్ హెచ్చరించారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జిలను ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో కమిషనర్ చాంబర్ ముందు నిరసన తెలిపి, కమిషనర్‌కు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదే తప్ప పరిష్కరించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకుఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు రాము, తిమ్మప్ప, మధుసుధన్, కుమార్ మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

సోమందేపల్లి : తన భూమిని తమ గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆక్రమించుకున్నాడని తన భూమిని తనకు ఇప్పించాలని మండల పరిధిలోని చెన్నాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు అధికారులను కోరారు. సర్వేనెంబర్ 5-3 లెటర్ లో గల న భూమిని ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆక్రమించుకున్నాడని విచారణ చేసి తనకు న్యాయం చేయాలని తహశీల్దార్ మురళీకృష్ణ శుక్రవారం వినతి పత్రం అందజేశాడు. విఆర్‌ఒను సంఘటన స్థలానికి పంపించి విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, ఆంజనేయులు, కొండా వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

కదిరి టౌన్ : కదిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిత్య అన్నదానం కోసం 20 బియ్యం బస్తాలను దాతలు వితరణ చేశారు. కదిరి రూరల్ మండలం బత్తలపల్లి తండాకు చెందిన మూడే నగేష్ నాయక్ బి, వెంకటేష్ నాయక్ బియ్యం బస్తాలను కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణకు అందజేశారు.

బియ్యం పాకెట్లు అందజేస్తున్న దాతలు

డ్రై డేను తప్పనిసరిగా పాటించాలి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రజలందరు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి పలు వార్డులను పరిశీలించారు. 3వ వార్డులో ఉన్న పెద్ద కాలువను పరిశీలించారు. కాలువలో పేరుకు పోయిన చెత్తను జెసిబిలు ఏర్పాటు చేసి తొలగించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలు వారంలో ఒక రోజు డ్రై డేను పాటించి, ఇంటిలో నిల్వ చేసిన నీటిని శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టుపక్కల ఉన్నా పరిశాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ నీరజ, ఎఇలు సురేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువను పరిశీలిస్తున్న కమిషనర్

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కదిరి టౌన్ : చిన్నపిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీవో సుధామని చెప్పారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కదిరి ఎంపీడీవో కార్యాలయం లో ఎంపీడీవో సుధామణి ఆధ్వర్యంలో పిహెచ్‌సి వైద్యాధికారి శంకర్ నాయక్, ఐసిడిఎస్ అధికారులు, మండల విద్యాధికారి, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కదిరి రూరల్ మండలంలోని అన్ని పాఠశాలలుచ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందజేయాలని చెప్పారు. ఈసమావేశంలో పిహెచ్‌సి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బుక్కపట్నం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవంపై మండల పరిధిలోని స్కూల్ హెడ్ మాస్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 14వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 2 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు భోజనం తర్వాత మింగించాలని చెప్పారు. అనంతరం ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఇఒ గోపాల్ నాయక్, మెడికల్ ఆఫీసర్ సునీల్ కుమార్, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీవో నరసింహ నాయుడు అధ్యక్షతన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. 14వ తేదీన విద్యార్థులతో నులి పురుగులు నివారణకు మాత్రలు మింగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట చిరంజీవి, డాక్టర్ రాజకుమార్, ఎంఇఒ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఈనెల 14, 18 తేదీలలో జరుగుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నిర్వహకులు విజయవంతం చేయాలని ఎంఇఒ గంగప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం రూరల్ మండలం ఊడుగులపల్లిలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఆయన పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎ-4 పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడికి ఘనస్వాగతం

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర తెలుగుదేశం అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పుట్టపర్తికి వచ్చిన సందర్భంగా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆయనను గజమాలతో సత్కరించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పెద్ద సంఖ్యలో హాజరైన తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు జిల్లా నాయకులు శాలువాలతో పూలమాలతో అచ్చెన్నాయుడును సత్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈనెల 13న జరుగు ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థి రాంభూపాల్ రెడ్డికి, రెండవ ప్రాధాన్యత ఓటు పిడిఎఫ్ అభ్యర్థులకు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రామాంజనేయులు, విజయ్ కుమార్, అంబులెన్స్ రమేష్, ఆవుల సుబ్రహ్మణ్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, పుల్లప్ప, ప్రవీణ్ కుమార్, లక్ష్మీదేవి ఓబులేసు, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు షామీర్, మురారి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు టీడీపీ నాయకులు ధర్మవరంలో శుక్రవారం ఘనస్వాగతం పలికారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పార్టీ సమావేశానికి వెళ్తూ మార్గమధ్యలో ధర్మవరంలో దిగారు. ఈక్రమంలో టీడీపీ నాయకులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అక్కడి నుండి పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. అచ్చెన్నాయుడుకు స్వాగతం పలికిన వారిలో కమతంకాటమయ్య, కాచర్ల కంచన్న, చింత పులుసు పెద్దన్న. చింతలపల్లి మహేశ్ చౌదరి, పోతుకుంట లక్ష్మన్న, నాగూర్ హుస్సేన్, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, రాళ్లపల్లి షరీఫ్, బొట్టుకిష్ట తదితరులు ఉన్నారు.

గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

కర్నాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి : మండల పరిధిలోని 44 వ జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద పెద్ద మొత్తంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న రెండు వాహనాలను శుక్రవారం పట్టుకున్నట్లు పెనుకొండ సిఐ కరుణాకర్, స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. కదిరి ప్రాంతానికి చెందిన పవన్ కుమార్, సల్మా ,శంకరప్ప అనే వ్యక్తులు బాగేపల్లి తాలూకాకు చెందిన చేలూరు గ్రామ బ్రాందీ షాప్ నుండి సుమారు10,560 మద్యం ప్యాకెట్లను టాటా ఇండికా, బులెరా వాహనాల ద్వారా తరలిస్తుండగా మార్గమధ్యంలో పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు మూడు లక్షల అరవై నాలుగు వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బులెరా వాహన డ్రైవర్ అర్జున్ తప్పించుకున్నాడని మిగిలిన వారిని అరెస్టు చేశామని వీరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుళ్లు ఆదినారాయణ, సుధాకర్, పోలీసులు రంగనాయకులు, జగన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని వీరాపురం గ్రామ పంచాయతీ హుస్సేన్ పురం గ్రామంలో శుక్రవారం ఓ ఇంటి లో అక్రమంగా కర్నాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 42 కర్నాటక మద్యం పాకెట్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

గంజాయి పట్టివేత

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్ద గోవిందు వారి పల్లి, గ్రామ సమీపంలోని ముళ్ళ పొదల వద్ద నలుగురు వ్యక్తుల నుంచి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో సిఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఇద్దరు మగవారిని, మరో ఇద్దరు ఆడవారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ. 5,100 నగదు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్డుకు హాజరుపర్చగా వారికి ఒక సంవత్సరం జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించినట్లు సిఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ రాంభూపాల్‌యాదవ్ తెలిపారు.

నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు

గోరంట్ల : జిల్లాలోని రామగిరి గ్రామానికి చెందిన ఎస్సీ యువతిని మోసం చేసిన కేసుల నెల్లూరు జిల్లా గొల్లపల్లికి చెందిన నవీన్ కుమార్ చౌదరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. బాధితురాలు గోరంట్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో నవీన్ కుమార్ చౌదరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

హిందూపురం : హిందూపురం అప్‌గ్రేడ్ స్టేషన్‌లో 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో 35 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1602 లీటర్ల కర్నాటక మద్యాన్ని జిల్లా పోలీస్ అధికారుల సూచన మేరకు శుక్రవారం ధ్వంసం చేశారు. సిఐ క్రిష్ణారెడ్డి, సెబ్ సిఐ స్వర్ణలత తమ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌తో ధ్వంసం చేసి, అనంతరం నిప్పుతో కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సుమారు రూ. 6.72 లక్షలు విలువ చేసే కర్నాటక మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఎస్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ, మహిళా ఉద్యోగులు

పుట్టపర్తి రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి పనికి సమయం కేటాయించడం చాలా ముఖ్యమనానరు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు పిల్లల పట్ల చాలా శ్రద్ధ పెట్టాలన్నారు. తల్లి తన బాధ్యతలను విస్మరించకూడదని, బిడ్డలతో ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా సమయం కేటాయించాలని సూచించారు. పిల్లల ప్రవర్తన ఎక్కువ శాతం తల్లిదండ్రుల శిక్షణ పై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి గ్రామ సచివాలయాలలో 60శాతం మంది మహిళలే ఉన్నారని చెప్పారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండే విధంగా ఐసిడిఎస్, విద్య, వైద్య శాఖలు కలిసి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. నూటికి నూరు శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటారని వారిని వారిని గుర్తించి వారికి మంచి వైద్య సేవలు అందించాలని సూచించారు. గర్భిణులకు, వారి ప్రసవానంతరం అందించే సేవలు, అనీమియా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ మీనాక్షి, సోషల్ వెల్ఫేర్ డిడి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ గాయత్రి, ఎన్జీవో సంస్థ ప్రతినిధి భానుజ, హ్యాపీ హోం ఎన్జీవో సంస్థ ప్రతినిధి రజితతో పాటు ఆయా శాఖల అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మహిళలను అన్ని రంగాలలో రాణించాలని ఎపిఎం సూర్యనారాయణ కోరారు. శుక్రవారం ప్రగతి మండల సమైక్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారి లక్ష్మీప్రియ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలోన రాణించాలన్నారు. మహిళా సంఘాలు సక్రమంగా పొదుపు చేసుకొని బ్యాంకు లావాదేవీలు జరిపి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రామ్మోహన్ రెడ్డి, చెన్నకేశవులు, వరప్రసాద్, షాకీర్ ,మహిళ సమైక్య అధ్యక్షురాలు సంధ్యారాణి, కార్యదర్శి శైలజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం లో పనిచేస్తున్న మినిస్టీరియల్ స్టాఫ్‌ను, కదిరి డీఎస్పీప భవ్య కిషోర్‌ను, ఎఆర్ విభాగంలో మహిళ కానిస్టేబుళ్లను మహిళ హోంగార్డులను ఈసందర్భంగా ఎస్పీ సన్మానించారు. నవసమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలం అన్నారు..ఈ కార్యక్రమంలో బాగంగా గత ఏడాది జూలై నెలలో జిల్లా పోలీస్ కార్యాలయం లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్య కారణాలతో మరణించిన హోంగార్డు ఎ. చెన్నరాయుడు కుటుంబ సభ్యులకు శుక్రవారం యాక్సిస్ బ్యాంక్ ప్రమాద బీమాకింద రూ. 30 లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎఎఒ సుజాత, జిల్లా పోలీస్ కార్యాలయ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పెద్దమంతూరు సచివాలయ మహిళ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సర్పంచులకు, ఎంపిటిసిలకు, సచివాలయ, వైద్యసిబ్బందిని సన్మానించారు.

సిహెచ్‌సి పథకంపై రైతులకు అవగాహన కల్పించాలి

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం తీసుకొస్తున్న పథకాలతో పాటు కస్టమ్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి) పథకంపై రైతు భరోసా కేంద్ర సహాయకులు రైతులకు వివరించాలని ఎడిఎ అలీఫ్ అలీ ఖాన్ సూచించారు. శుక్రవారం రూరల్ మండలంలోని సెరికల్చర్ రైతు శిక్షణ కేంద్రంలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్, సిరికల్చర్ ఎడిఎ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వివిధ సబ్సిడీ పథకాలు గురించి వివరించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు, పేద రైతులకు వ్యవసాయ పనిముట్లను కిరాయిపై సబ్సిడీ ధరలకు సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి) పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు రైతు భరోసా కేంద్ర సహాయకులు అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఎప్పటికప్పుడు ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు ఇమ్రాన్ ఖాన్, విజయభారతి, వంశీకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు అనిల్ కుమార్, లలితతో పాటు పరిగి, హిందూపురం, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్ర సహాయకులు పాల్గొన్నారు.

ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు : మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం టేకులోడు పాఠశాల 2023-24 సంవత్సరానికి ఐదోతరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం కరుణజ్యోతి తెలిపారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రవేశాల కొరకు ఆన్లైన్ లో ఏప్రిల్ 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులను వేధించడం ప్రభుత్వానికి తగదు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పైన వైసిపి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని ఇది తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 డీఈవో ఆఫీసుల వద్ద ఉపాధ్యాయుల వేధింపులపై ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్న నేపథ్యంలో కొత్త చెరువులోని గాంధీనగర్ పాఠశాలలో ఉన్న డీఈవో ఆఫీసు వద్ద శుక్రవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వేధింపులు, యాపుల సమస్యల ద్వారా మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ప్రశ్నించే వారిపైన ప్రభుత్వం కేసులు పెడుతోందని విమర్శించారు. మధ్యాహ్నం భోజనం సమస్యల పైన కూడా ఉపాధ్యాయులపైనే నెపం నెట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, హెచ్ భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణ, బాబు, పెద్దన్న, నరసింహులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, నాయకులు అంజి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్నయుటిఎఫ్ నాయకులు

CHANGE OF NAME

I, **SHAIKH SAMIULLAH** (new name) previously called RUDDUM SAMEEULLA (old name) S/o, Shaikh Jafar Vali, resident at D.No : 9/488 mandi syed. Street, Kadiri - 515591, Ananthapuramu (Dist), A.P., India. Hence I am making this declaration for publication in daily news papers for change of my name (old name) RUDDUM SAMEEULLA to my (new name) SHAIKH SAMIULLAH, and also my father name (old name) R. Jafarullah to his (new name) Shaikh Jafar Vali, and also spouse name(old name) R. Mubinthaj to (new name) SHAIKH MUBIN TAJ. In passport (Bearing No:- U0656846).

CHANGE OF NAME

I, **SHAIKH MUBINTAJ** (new name) previously called RODDAM MUBIN TAJ (old name) W/o, Shaikh Samiullah, resident at D.No: 9/488 Mandi Syed Street, Kadiri - 515591, Ananthapuram (Dist), A.P., India. Hence I am making this declaration for publication in daily news papers for change of my old name RODDAM MUBIN TAJ to my new name SHAIKH MUBIN TAJ, and also my husband name i.e., old name RODDAM SAMIALLA to his new name SHAIKH SAMIULLAH. In passport (Bearing No:-L4578114

వ్యాయామశాలను అందుబాటులోకి తేవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి మడకశిర

ప్రభుత్వం నిరుపేద యువత సంక్షేమ దృష్ట్యా ఏర్పాటు చేసిన వ్యాయామశాలను వెంటనే అందుబాటులోకి తెవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన వ్యాయామశాలను అందుబాటులోకి తేవాలన్నారు.కొందరు అధికారులు లేనిపోని నిబంధనలను సృష్టించి వ్యాయామశాల కార్యరూపానికి అడ్డుగా మారారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు భేషజాలను పక్కనపెట్టి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వెంటనే వ్యాయామశాలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భరత్, మారుతి, నరేష్, మంజు తదితరులు పాల్గొన్నారు .

గురుకుల కళాశాలలో సరస్వతిపూజ

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే కళాశాలలో ఇంటర్మీడియట్. ద్వితీయ సంవత్సరం చదువుతున్న కళాశాల విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. కళాశాల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక తహశీల్దార్ నాగభూషణం హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐముని ప్రతాప్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ నాయక్, ఎంజెపి పాఠశాల కళాశాల అధ్యాపకులు, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో విషజ్వరాలు

అమడగూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కాలనీలో డ్రయినేజీ లేక పోవటంతో మురగునీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధిచెందాయి. వీటి బారిన పడిన కాలనీవాసులకు విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కిందట కాలనీకి చెందిన బాలుడు డెంగ్యూ జ్వరంతో మృతిచెందాడు. అప్పుడు కాలనీని సందర్శించిన అధికారులు డ్రయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇంటి లింకు డాక్యుమెంట్లు పోగొట్టుకు పోయినది

శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం, యాదవ వీధి, డోర్‌నెం. 21-430లో గల యం.భాగ్యలక్ష్మి భర్త: యం.రాజు ఆధార్ నెం.7145 3242 9935, వీరి పేరు మీద గల **డాక్యుమెంట్ నెం.630/2023, సర్వేనెం.471-10, విస్తీర్ణం:36.75** Sq.yds ధర్మవరం సబ్‌రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడినది. దీనికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు పోగొట్టుకు పోయినది. ఈ లింకు డాక్యుమెంట్లుకు సంబంధించిన వివరములు: **శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం, అప్రాచెరువు గ్రామానికి చెందిన సిద్దే రంగమ్మ భర్త లేట్ యస్.చంద్రప్ప, ఆధార్ నెం.3755 1545 188, డాక్యుమెంటు నెంబరు: 1975/2022.** ఈ డాక్యుమెంట్సు దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయగలరు.

సెల్: 6305056551